# ఫార్మాసిటీని రద్దు చేయాలి



ఫార్మాసిటీ వద్దంటూ రాసిన ఉత్తరాన్ని చూపుతున్న తాటిపర్తి గ్రామ మహిళ

- మా భూములను వాపసు ఇవ్వాలి
- నాలుగు గ్రామాల రైతులు డిమాండ్
- సోనియా, రాహుల్‌కు లేఖలు

యాచారం, సెప్టెంబర్ 21: యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాస్తున్నారు. ఇప్పటికే నానక్‌నగర్ గ్రామానికి చెందిన 200 మంది రైతులు లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఫార్మాసిటీ వద్దంటూ తాజాగా శనివారం కుర్మిద్ద గ్రామానికి చెందిన కొంత మంది రైతులు పోస్టుకార్డులతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మాసిటీని రద్దుచేయాలని, తమ నుంచి సేకరించిన భూములను తిరిగి ఇవ్వాలని ఆ లేఖల్లో డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం రైతులతో కలిసి పాదయాత్ర చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీలు కోదండరామ్, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదవులను చేపట్టగానే ఫార్మా బాధిత రైతులను మర్చిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్‌సిటీ అంటున్నారే తప్ప ఫార్మాసిటీని రద్దు చేసినట్టు ఎక్కడా జీవో చూపించడంలేదని మండిపడుతున్నారు. పైగా ఫార్మాసిటీని నిర్మించి తీరుతామని హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని ఇప్పటికైనా ఫార్మాసిటీని రద్దు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులను తమ గ్రామాల్లో తిరుగనివ్వబోమని హెచ్చరించారు.



కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాసిన కుర్మిద్ద గ్రామ రైతులు

## ఫార్మాసిటీ అక్కడే ఉంటుందా..లేదా?

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడంలేదని తప్పుపట్టారు. ఫార్మాసిటీ భూములకు సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపడతామని, ఆ లోగా ప్రభుత్వ నిర్ణయంతోపాటు ఫార్మాసిటీకి సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాల్సిందేనని తేల్చిచెప్పారు.

**యథావిధిగా ఫార్మాసిటీ**

కాగా, ఫార్మాసిటీ యథాతథంగా కొనసాగుతుందంటూ హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఫార్మాసిటీ రద్దయినట్టు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆ అఫిడవిట్‌లో పేర్కొంటూ.. 2016లో జారీ చేసిన జీవో 31 ప్రకారం ఫార్మాసిటీ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు. గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, దాన్ని రద్దు చేసేందుకు ఎలాంటి విధాన నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం మేడిపల్లిలో 1,700 ఎకరాల సేకరణకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11(1) కింద గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఇదే ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 2016లో ప్రభుత్వం జీవో 31ను జారీ చేసిందని, అంతేకాకుండా భూసేకరణ చట్టం కింద కొన్ని మినహాయింపులు ఇస్తూ జీవో 46ను జారీ చేసిందని తెలిపారు. డిక్లరేషన్, పరిహారం అవార్డు నిబంధనల ప్రకారం జరగలేదన్న ఆరోపణలు అవాస్తవమని, భూసేకరణ చట్టంలోని నిబంధనల ప్రకారమే అక్కడ భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో పిటిషనర్‌కు సంబంధించిన 10 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. డిక్లరేషన్ అవార్డుపై పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారని, ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. అభ్యంతరాల స్వీకరణ సహా భూసేకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించిందని వివరించారు. ఈ ఆదేశాల ప్రకారం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ అమల్లోనే ఉన్నదని, ఈ నేపథ్యంలో సదరు భూములపై ధరణి పోర్టల్‌లో లావాదేవీలకు అనుమతించాలన్న పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తన భూములపై ధరణి పోర్టల్ ద్వారా ఎలాంటి లావాదేవీలు నిర్వహించలేరని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ అమల్లో ఉన్నందున ధరణిలో ఎంట్రీల కోసం పిటిషనర్ చేసుకున్న దరఖాస్తును అనుమతించలేమని స్పష్టం చేశారు. అంతేకాకుండా అవార్డు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీళ్లు దాఖలు చేశామని, అవి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ నిమిత్తం రెండు పత్రికల్లో నోటిఫికేషన్‌ను ప్రచురించామని, గ్రామసభ నిర్వహించి నోటీసులు జారీచేయడంతోపాటు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు ఆవశ్యకతను అందరికీ వివరించామని చెప్పారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున్న పరిహారం ఇవ్వాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆ తర్వాత దాన్ని రూ.16 లక్షలకు పెంచామని, దానికి అదనంగా రైతులకు 121 చదరపు గజాల చొప్పున స్థలాలను కూడా కేటాయిస్తున్నామని వివరించారు. అవార్డు నోటిఫికేషన్‌పై పిటిషనర్ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని, నోటీసులకు సమాధానం ఇవ్వనందున అధికారులు జారీ చేసిన పరిహారం మొత్తాన్ని భూసేకరణ అథారిటీ వద్ద డిపాజిట్ చేశామని తెలిపారు.



ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

## ప్రజాగ్రంథాలయంలో నేడు దశాబ్ది ఉత్సవాలు

- 2023 కథల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ
- 'నమస్తే తెలంగాణ-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' నిర్వహణ

హనుమకొండ సబర్బన్, భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21: ముల్కనూరు ప్రజా గ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమైంది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నది. ఇదే తరహాలో నిర్వహించిన 'కథల పోటీలు-2023' విజేతల ఎంపిక ప్రక్రియ పూర్తికాగా.. ఆదివారం దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇదే వేదికపైనే విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 2014లో ఆ గ్రామ పూర్వ విద్యార్థులు ప్రజాగ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా ఎదిగి ముల్కనూరు ప్రజాగ్రంథాలయంగా రూపుదిద్దుకొన్నది. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ఈ గ్రంథాలయం ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. ముఖ్య అతిథులుగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, తెలుగు కవి అందెశ్రీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి హాజరుకానున్నట్టు నిర్వాహకులు సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వంగ రవి తెలిపారు.



వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని ఏజెన్సీ గ్రామం గొల్లపల్లె

## ఏజెన్సీ గ్రామంలో మద్యపాన నిషేధం

**ఆదర్శంగా వరంగల్ జిల్లాలోని గొల్లపల్లె గ్రామం**

నల్లబెల్లి, సెప్టెంబర్ 21: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలానికి సరిహద్దులో ఉన్న ఏజెన్సీ గ్రామం గొల్లపల్లె సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో 750 మంది జనాభా ఉండగా.. చాలామంది యువత గుడుంబా, మద్యానికి బానిసై యుక్తవయస్సులోనే మృత్యువాత పడ్డారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మరికొందరు గుడుంబాకు బానిసై కష్టపడి సంపాదించిదంతా తాగుడుకే ఖర్చు చేస్తున్నారు. కుటుంబాలను పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన గ్రామప్రజలు.. గ్రామం బాగుపడాలంటే మద్యపాన నిషేధమొక్కటే మార్గమని నిర్ణయించుకున్నారు. వారం రోజుల క్రితం గ్రామంలో సమావేశమై సంపూర్ణ మద్యపానం అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీలకతీతంగా గ్రామంలోని యువకులు, గ్రామపెద్దలు సంయుక్త నిర్ణయంతో మద్యపాన నిషేధాన్ని ప్రకటించి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

**మంత్రి పొంగులేటి హామీ**

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ) : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్, తాసీల్దార్లు, వీఆర్వోలు, రీడిప్లాయిడ్ వీఆర్వోల అసోసియేషన్లు, వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి, రెవెన్యూ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్లతో మంత్రి పొంగులేటి శనివారం సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 29న తాసీల్దార్లు, అక్టోబర్ 6న డిప్యూటీ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో భేటీ కానున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ అయిన తాసీల్దార్లు, 317జీవో బాధితులను పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని, అన్నిస్థాయిల్లో అర్హులకు పదోన్నతులు కల్పించాలని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు మంత్రికి విజ్ఞప్తి చేశాయి.

## దవాఖానాల్లో బయోమెట్రిక్ అటెండెన్స్

**మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో తక్షణమే బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు, ఫుడ్ సెక్యూరిటీ అధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలోని డైట్ క్యాంటీన్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. హెల్త్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

## ప్రజాపాలన పేరిట ఉత్సవాలెందుకు?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రజాపాలన పేరిట ఉత్సవాలు నిర్వహించడమెందుకో అర్థం కాలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయం(ముగ్దుంభవన్)లో శనివారం విలేకరులతో మాట్లాడారు. తొలి తెలంగాణ పోరాట యోధులు సురవరం సుధాకర్‌రెడ్డి, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లను యూనివర్సిటీలకు పెట్టడం, గద్దర్ పేరిట అవార్డులు అందజేయడాన్ని అభినందించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎన్ బాలమల్లేశ్, కలవేణ శంకర్, ఎం బాలనర్సింహ పాల్గొన్నారు.

**సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నరు..**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తమ చరిత్రగా చెప్పుకునేందుకు కొన్ని పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని పలువురు వక్తలు మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల ముగింపు సభ శనివారం రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రొఫెసర్ హరగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.

## డిజైన్ల మేరకే కాళేశ్వరం నిర్మాణం

- నిబంధనల ప్రకారమే క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు
- కమిషన్ ఎదుట ప్రాజెక్టు ఇంజినీర్ల వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) ఇచ్చిన డిజైన్ల మేరకే చేపట్టామని, ఎక్కడా డివియేషన్ లేదని ఇంజినీర్లు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జస్టిస్ ఘోష్ ఎదుట నివేదించారు. బీఆర్కే భవన్‌లో శనివారం జస్టిస్ ఘోష్ నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగింది. అంచనాకు మించి బరాజ్ వద్ద నీటి ప్రవాహ వేగముందని, గుర్తించిన వెంటనే పరిష్కారాల కోసం నిపుణులను సంప్రదించామని, పరీక్షలను నిర్వహించామన్నారు. నిర్మాణ ఏజెన్సీ సైట్ వద్దనే క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. నాణ్యతా పరీక్షల్లో కచ్చితమైన ఫలితాలు వచ్చాయని తెలిపారు.

## ఐఐటీలో చదువుతూ గంజాయి దందా

- హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ విక్రయాలు
- పట్టుబడ్డ ఇద్దరు తమిళ నాడు ఐఐటీ విద్యార్థులు
- మరోచోట గంజాయి అమ్ముతూ దొరికిన టెకీ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో విద్యాభ్యాసం.. కానీ, చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి అమ్ముతూ పట్టుబడ్డారు ఇద్దరు ఐఐటీ విద్యార్థులు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, ఎస్టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని నెల్లూరుకు చెందిన కొలి మణికంఠ చౌదరి, గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన పవన్.. తమిళనాడులోని ఐఐటీ క్యాంపస్‌లో చదువుతున్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి అమ్మి డబ్బు సంపాదించుకోవాలని నిర్ణయించుకున్నారు.ఎవరికీ అనుమానం రాకుండా హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్‌నగర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో తమ దందా నడుపుతున్నారు. రూ.వెయ్యికి 20 గ్రాములు చొప్పున అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్‌పై దాడిచేసి ఇద్దరిని అరెస్టుచేశారు. వారి వద్ద 1.2 కిలోల గంజాయితోపాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న వైజాక్‌కు చెందిన కమలేశ్, అమోశ్‌పై కేసు నమోదుచేశారు. నిందితుల వద్ద గంజాయి కొనుగోలు చేసిన 22 మందిని గుర్తించి, వారిపైనా కేసులు పెట్టారు. అదేవిధంగా, నెల్లూరు జిల్లాకు చెందిన ఎర్రగంటి లోకేశ్.. నగరంలోని ఒక ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గంజాయి మత్తుకు అలవాటు పడటంతో ఉద్యోగం పోయింది. గంజాయి విక్రయాలనే వృత్తిగా మార్చుకున్న లోకేశ్.. మణికొండలో ఇల్లు అద్దెకు తీసుకుని దందా కొనసాగించాడు. సమాచారం అందుకున్న ఆబ్కారీ అధికారులు.. నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద 1.74 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన నెల్లూరు వాసి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధుల బహిష్కరణ




నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వనపర్తి జిల్లా కొత్తకోట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, వాచ్‌మెన్, ప్లాంబర్ కం ఎలక్ట్రీషన్, గెస్టు ఫ్యాకల్టీ ఉద్యోగులు శనివారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య రాలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. -కొత్తకోట

## ఎల్లంపల్లి నుంచే నీళ్లు ఎత్తిపోశాం

- బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం



హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే ప్రస్తుతం మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అయినా కాళేశ్వరం జలాలు అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుదోవ పట్టిస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులోనే రూపకల్పనలోనే ఎల్లంపల్లి , నందిమేడారం, లక్ష్మీ బరాజ్, మిడ్‌మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగ ర్ భాగమై ఉన్నాయని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడారు. కాంగ్రె స్ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. కేసీఆర్ చేసిన రీడిజైన్ నిరుపయోగమని, మిడ్ మానేరు, లోయర్ మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్‌కు వచ్చే నీరు ఎల్లంపల్లి నుంచి తీసుకున్నవి మాత్రమేనని, విడతలవారీగా వర్షాలు కురవడం వల్లే అది సాధ్యమైందని తెలిపారు. ఆగిన పనులు పూర్తి చేసినంత మాత్రాన ప్రాజెక్టు రూపొందించినట్టవుతుం దా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోయకుండా ప్రాజెక్టులను నింపితే అవి కాళేశ్వరం నీళ్లు ఎట్లా అవుతాయో హరీశ్‌రావు సమాధానం చెప్పాలన్నారు.

## ఎల్లంపల్లిని పూర్తి చేసిందెవరు?

- కాంగ్రెస్ ప్రాజెక్టు పూర్తి చేస్తే నీళ్లెందుకు నింపలె?
- మంత్రి పొన్నం వ్యాఖ్యలపై నెటిజన్ల విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అవి కాళేశ్వరం జలాలు కావు' అని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి గప్పాలు తప్ప మరేమీలేదని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవంగా ఎల్లంపల్లి ప్రాజెక్టును తా మే నిర్మించామని కాంగ్రెస్ సర్కారు చెప్తున్న గొప్పలన్నీ కూడా ఒట్టి మాటలే. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసినా దానిని వినియోగంలోకి తీసుకురాలేదన్నది అంతే వాస్తవం. జలయజ్ఞంలో భాగంగా 2004లో రూ.3,177 కోట్ల తో 20.16టీఎంసీల నీటి నిల్వసామర్థ్యంతో ఎల్లంపల్లి ప్రాజెక్టును చేపట్టారు. తెలంగాణ వచ్చేనాటికి ప్రాజెక్టుపై రూ.3,347.27 కోట్లు ఖర్చుపెట్టారు. తెలంగాణ ఏర్పడేనాటికి ఏనా డూ ఆ రిజర్వాయర్‌లో 5 టీఎంసీలకు మించి జలాలను నిల్వ చేయలేదు. కారణం భూసేకరణ పూర్తి చేయకపోవటం, ముంపు బాధితులకు పునరావాసం కల్పించకపోవడమే. ప్రాజెక్టు కోసం మొత్తంగా 27,387ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 18,778 ఎకరాలను మాత్రమే సేకరించింది. ఇక పునరావాసం కల్పనకు 13,296 ఇండ్లను నిర్మించాల్సి ఉండగా, 1,448 ఇండ్లను మాత్రమే పూర్తిచేసింది. అదీగాక ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ వల్ల లక్షెటిపేట బ్రిడ్జి మునిగిపోయి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో రూ.2,052.73 కోట్లను వాటి కోసం వెచ్చించింది. బరాజ్‌ను 2016లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది. ఇదీ వాస్తవం. కానీ అందుకు విరుద్ధంగా ప్రాజెక్టు మొత్తం పూర్తిచేశామని మంత్రి పొన్నం వ్యాఖ్యానించడంపై తెలంగాణవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు. అదీగాక ఎల్లంపల్లి నుంచే నీళ్లను తరలించామని చెబుతున్న మంత్రి పొన్నం వాటిని ఏవిధంగా తరలించారో కూడా చెబితే బాగుండేదని చురకలంటిస్తున్నారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని తెలంగాణవాదులు వివరిస్తున్నారు. అం తేకాదు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌లోనే ఎల్లంపల్లి, నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్ మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భాగమై ఉన్నాయని అంగీకరించిన పొన్నం మరి ఆ యా రిజర్వాయర్లను నాడు ఎందుకు పూర్తి చేయలేదో కూడా చెబితే బాగుండేదని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కేసీఆర్ రీడిజైన్ ఫలితంగానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో 14టీఎంసీలుగా నీటి నిల్వ సామర్థ్యం ఏకంగా 141టీఎంసీలకు పెరిగిందని తెలంగాణవాదులు గుర్తుచేస్తున్నారు. నీటి కొరత ఉన్న వేళ మేడిగడ్డ నుంచి, వరద వచ్చినప్పుడు ఎస్సారెస్పీ నుంచి, ఆ దిగువన ఎల్లంపల్లి నుంచి ఇలా బహుళ ప్రదేశాల నుంచి జలాలను తరలించుకునే అవకాశమున్న ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమని, అది కేసీఆర్ రీడిజైన్ ఘనతని తెలంగాణవాదులు కొనియాడుతున్నారు.

## రంగంలోకి సైబర్ కమాండోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలను అరికట్టేందుకు ఐదేండ్లలో 5వేల మంది సైబర్ కమాండోలను సిద్ధం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. వివిధ రాష్ట్ర పోలీసు బలగాల నుంచి దాదాపు 350మందితో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేశారు. వీరికి తమిళనాడులోని తిరుచ్చి (ఐఐటీ)లో శిక్షణ ఇవ్వనున్నారు.శిక్షణకు వరంగల్ కమిషనరేట్‌లో డిప్యూటీ ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఏ.ప్రశాంత్‌కుమార్ ఎంపికయ్యారు.

## నేడు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఉప్పల్ భగాయత్‌లోని విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. యజ్ఞానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఆచారి, జూలూరు గౌరీశంకర్, దాసోజు శ్రవణ్, ఉపేంద్రాచారి హాజరవుతారని తెలిపారు.

## స్కిల్ వర్సిటీ పరిధిలోకి ఐటీఐలు

**కార్మిక ఉపాధి కల్పన శాఖపై సమీక్షలో సీఎం**

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ):నూతనంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటీఐ, ఏటీసీ, పాలిటెక్నిక్ కాలేజీలను తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రారంభించాలని నిర్దేశించారు. సిలబస్ రూపకల్పనకు నిపుణుల కమిటీని నియమించి విద్యావేత్తల సలహాలు స్వీకరించాలని సూచించారు. శనివారం సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పనశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీఐ కాలేజీలకు ప్రిన్సిపాళ్లు ఉండేలా చర్యలు తీసుకొని, సమగ్రంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో ఏటీసీలను ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఐటీఐ,ఏటీసీలు లేని నియోజకవర్గాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మినహా 100 నియోజకవర్గాల్లో ఐటీఐ/ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు.

# తిరుమల లడ్డూకు మళ్లీ నందిని నెయ్యి!

### 2024-25లో 350 మెట్రిక్ టన్నులకు ఆర్డర్ • కిలో నెయ్యి 478 రూపాయలకు కొనుగోలు

*హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపిన నేపథ్యంలో లడ్డూ తయారీలో మళ్లీ నందిని నెయ్యినే వినియోగించాలని టీటీడీ నిర్ణయించింది. 2024-25 సంవత్సరంలో టీటీడీకి 350 మెట్రిక్ టన్నుల నెయ్యిని సరఫరా చేయాలని ఆర్డర్ ఇచ్చారు. కిలో నందిని నెయ్యిని 478 రూపాయల చొప్పున టీటీడీ కేఎంఫ్ నుంచి కొనుగోలు చేయనున్నది. గతంలో 2013-14 నుంచి 2021-22 వరకు 5వేల టన్నుల నెయ్యిని కేఎంఎఫ్ సరఫరా చేసింది. 2022-23లో అధిక ధర ఉందనే కారణంతో నందిని నెయ్యి టెండర్‌ను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది.*

**కొద్దిరోజుల క్రితమే ఆర్డర్..**

- *తిరుమల అధికారులు కొద్ది రోజుల క్రితమే 350మెట్రిక్ టన్నుల నెయ్యి కోసం ఆర్డర్ చేసినట్టు కేఎంఎఫ్ ప్రెసిడెంట్ భీమానాయక్ తెలిపారు. ఆవు నెయ్యిని మాత్రమే తిరుమలకు సరఫరా చేస్తామని హామీ ఇచ్చామని పేర్కొన్నారు.*
- *శ్రీవారి ప్రసాదాల తయారీపై వస్తున్న వార్తలు తనను ఎంతగానో కలిచివేశాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు తెలిపారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సీఎం చంద్రబాబుకు సూచించానన్నారు.*
- *లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించడం పాపమని, ఘోరాతి ఘోరమని నటుడు మంచు మోహన్ బాబు ఎక్స్‌వేదికగా వ్యాఖ్యానించారు.*

**తిరుమలలో రేపట్నుంచి మహాశాంతి యాగం?**

- *తిరుమల ఆలయ పవిత్రతను కాపాడేందుకు టీటీడీ ఉపశమన చర్యలకు ఉపక్రమించింది. శనివారం ఈవో శ్యామలారావు ఆధ్వర్యంలో అత్యవసరంగా సమావేశమయ్యారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు శ్రీవారి ఆలయంలో మహాశాంతియాగం నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది.*



## నెయ్యి సరఫరా చేస్తాం : విజయ డెయిరీ లేఖ

*టీటీడీకి పాల ఉత్పత్తులు సరఫరా చేసేందుకు తెలంగాణ విజయ డెయిరీ సిద్ధంగా ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. ఈ మేరకు టీటీడీ ఈవో జే శ్యామల రావుకు శనివారం లేఖ ద్వారా ప్రభుత్వ ప్రతిపాదనను వెల్లడించారు. విజయ డెయిరీ ఉత్పత్తుల్లో నాణ్యతను నిర్ధారించడంతోపాటు లక్షలాది మంది పాడి రైతుల జీవనోపాధికి సంస్థ తోడ్పడుతుందని పేర్కొన్నారు.*